


కొంపలు కాలిపోతోన్నట్టు, తాగేసి తన్నుకుంటున్నట్టు, తుఫాను వచ్చేసినట్టు–గోలగోల! గొడవ గొడవ! రొదరొద! గంద్రగోళం! అలజడి!

చెవులు చిల్లులుపడిపోతాయేమో అనిపిస్తోంది! బుర్ర పిచ్చెక్కిపోతుందేమో! కొంప దీసి ఆగోలకి అమాంతం హార్ట్ఎటాక్ వచ్చేస్తుందేమో! హరీమంటాడేమో? వెధవ, దిక్కుమాలిన పాడుగోల కాదుగాని!...

విసుక్కుంటూ, తిట్టుకుంటూ, మూలుగుతూ ఆ వేపుకి వెళ్ళేడు శర్మ. వెళ్ళలేక ఆగిపోయేడు. వెనక్కి వచ్చేసేడు. అక్కడికి వెళ్ళడం, పద్మవ్యూహంలోకి వెళ్ళేంత కష్టం!! తను అభిమన్యుడు కాడు! ఒకవేళ వెళ్ళినా చచ్చాడే!

శర్మ నాలుగు అడుగులు వేసేడో లేదో' నాల్నాగులు కాకులు రివ్వు రివ్వు మంటూ వొచ్చేయి మీదికి. పిల్లనివ్వడం యిష్టంలేని మామలా ఒకటి క్రూరంగా విష్ చేసింది! పేకాటలో సర్వాంగక్షవరం అయినవాణ్ణి, అవతలవాళ్ళు ట్రీట్ చేసినట్టు కొన్ని హేళనగా, విసురుగా, రవుడీజమ్‌గా, మదంగా రెక్కల్తో, ముక్కుల్తో, కాళ్ళతో తన్నీ, పొడిచీ, కుమ్మేయి.

గుండె ఝల్లుఝల్లుమంది శర్మకి. వొళ్ళంతా గజగజ వొణికింది. ఏమిటీ విపరీతం? ఏమిటీ దారుణం? నిన్నా, మొన్నా 'హాత్' అంటే 'అలాగేలే, పోతా' అనీ చక్కా ఎగిరిపోయేవే! అలాంటివి! ఇవాళ అస్సలు జడవడంలేదు! సరిగదా... చచ్చినట్టు పడుండే శ్రామికవర్గం, పేదలు, ఒక్కసారి విప్లవశంఖం పూరించినట్టు–విజృంభించేస్తున్నాయే?

"అటువేపు వెళ్ళకురా!" అని అరిచింది చెల్లెలు పద్మిని. "కాకిపిల్ల గూట్లోంచీ పడిపోయిందిరా! అందుకలా గోలచేస్తున్నాయ్!" అంది.

"అలానా?" అన్నాడు శర్మ.

అంటుంటే అంతలో ఇంకో విలన్ ఎగిరొచ్చి 'డిష్యుం' అంటూ ఖర్చుకిచ్చేడు!

వొచ్చేస్తోంటే, మరో విలనుడు వెనకనించి 'డిష్యుం' చేసేడు !!

# శివల జగన్నాథరావు

# సామ్యం

రెండే అంగల్లో, ఇంట్లోకి వచ్చిపడ్డాడు శర్మ.

"కాకిపిల్ల చచ్చిందేవిటే?" అడిగేడు.

"చావలేదురా!"

"లేదూ? మరయితే, అట్లా అరిచీ చస్తాయేం? వెధవ్వి! తన్నీఛస్తాయేం?"

"వాటికోపంగా ఉందేమో? వాటి పిల్లని తీసిదాచేననీ..." అంది పద్మిని.

"నువ్వా? ఎందుకలా చేసేవు?" శర్మ ఆశ్చర్యంతో విసుక్కున్నాడు.


"పాపం అది నేలమీద పడిపోయిందిరా, చెట్టుమీంచీ పడిపోయి బిక్కు బిక్కు చూస్తోంది. తిండిలేకా ముండ చచ్చివూరుకుంటుందేమోనని...లోపలికి మెల్లిగా ఎత్తుకుని తెచ్చేసేను..."

"అలాగా? ఏదీ అది?"

పద్మిని పెరటివేపు ఉన్న చిన్న సామాన్ల గది దగ్గరికి వెళ్ళింది. ఆ గదిలో ఒక చెక్కపెట్టెలో కాకిపిల్లని దాచింది పిల్లులూ అవీ తినెయ్యకుండా. అక్కడ వుంచీ, దానికి అన్నం మెతుకులవీ పెడ్తోంది.

శర్మకీగొడవంతా తెలీదు. అతను ఆఫీసు పనిమీద పైవూరికి వెళ్ళి, నిన్నరాత్రి వచ్చేడు, రాత్రి పెరట్లోకి వెళితే ఏగోలాలేదు! రాత్రివేళ కాకులు గూళ్ళలోంచీ ఇవతలికి రాలేవుగద అనుకున్నాడు చెల్లెలు చెప్పింది విని.

పద్మిని ఆ కాకిపిల్ల విషయంలో కలుగజేసుకున్న దగ్గర్నుంచీ, అవి ఆ అమ్మాయిమీద



పల్లమాలిన ఉక్రోషంతో ఉన్నట్టు వాటి గొడవ చూస్తే అర్థమవుతోంది!

పద్మిని ఇల్లుదాటీ, ఒక్క అడుగు పెరటివేపుగాని, వీధివేపుగానీ వెళితేచాలు! అమాంతం కాకులు ఒక్కుమ్మడిగా దాడిచేస్తున్నాయి! చేతిమీద పొడిచేయి! బుగ్గమీద చిన్నగాటు కాలిగోరుది పడింది: తలమీద సరేసరి...చాలా సార్లు తన్నేయి!

ఇంట్లో అమ్మా, నాన్నా, అక్కయ్యా అందరూ ఆ కాకిపిల్లని బయటపారేయమన్నారు.

"తిన్నగా ఉండక, ఎందుకొచ్చిక తద్దినంవే ఇదీ?" అంది తల్లి.

"ఎలాగమ్మా? బయటపడేస్తే ఏ గండు పిల్లో తినేస్తుందే!"

"తినెయ్యనీ! చావనీయి! అదేం ఛస్తే నీకెందుకే? అదిఛస్తుందనీ, నువ్వాఛస్తావుటే? చూడు! వొళ్ళంతా ఎట్లా పొడిచి వదిలేయో? పెళ్ళికావల్సిన పిల్లవి! నీకిదేం ఖర్మంవే? తాగుబోతు మొగుడిచేత తన్నించుకున్నట్టూ, ఆ దెబ్బలేమిటే?"

పద్మిని వాళ్ళ మాటల్ని పట్టించుకోవటం లేదు. అన్నయ్యని తీసుకువెళ్ళి, కాకిపిల్లని చూపించింది. అది ఇంతగొడవకి తనే కారణం అయినా, 'నేనేం ఎరగను' అన్నట్టుచూస్తోంది! ఎర్రటి నోరంతా తెరిచేసి, 'నువ్వేలాఛస్తే నాకేం? నాకేం పెడతావ్? నా కడుపు కాలిపోతోంది' అని కాకి బాకా వూత్తోంది. కాకా పట్టడం రాకపోయినా, ఆ పదం మాత్రం వుచ్చరించుతోందది!

శర్మ దాన్ని చూసిందాకా తిట్టుకున్నాడు చూసేక జాలిపడ్డాడు. నిజమే! చెల్లాయి అన్నట్టూ, పాపం ఆ ప్రాణి నిష్కారణంగా బలి అయిపోతుంది, బయటపడవేస్తే!! దాన్ని ముట్టుకున్నారనీ, అంత గోలచేస్తున్న కాకులు దాన్ని బయటపడవేస్తే తీసుకుపోతాయా గూట్లోకి? ఊహు!

ఇంతకుముందిలాంటి సీన్ చూసేడుగద? అవి ఆ పిల్లచుట్టూచేరీ, అలోపాలో అరవడం తప్పా ఏం చేయవు!! ఇంత తిండి (తొండ) పిసరేనా పెట్టవు!! అదేం వెధవబుద్దో? ఆ గూటిలో అది వుంటేనే, వుయ్యాల్లో పిల్లకి వూరంత ముద్దు వేసినట్టూ, పిల్లని మురిపంగా, శ్రద్ధగా, మమకారంగా చూస్తాయి!!

స్నేహితుడు రాజువస్తే, శర్మ బట్టలువేసుకుని, వీధిలోకి వెళ్లేడు. రాజుతో మాట్లాడుతూ ఆ వేపు ఆశ్చర్యంగా చూసేడు. ఆ వీధి చివరలో ఒక చింతచెట్టువుంది. ఆ చెట్టుకింద నీడలో ఒక ఆడది పక్కన పసికందుని పడుకోబెట్టుకుని తను పడుకున్నది.

"ఎవ్రరా అదీ?" అడిగేడు శర్మ తమ పక్కింటి పదేళ్ళ శీను ఆటువస్తే.

శీను చెప్పేడు. "మొన్న మధ్యాన్నవేమో అదీవీధిలోకొచ్చిందండీ! ఆ సాయంకాలమేమో దానికి పిల్లపుట్టింది. ఇక్కడే వుండిపోయింది చెట్టుకిందే! వీధిలో అందరూ ముష్టిదానికి అన్నంపెడ్తున్నారు...అదక్కడే పడుకుంటోంది..."

శర్మ, రాజు అలా వెళ్ళేరు. చింతచెట్టు కింద, చిరుగుల బొంతలాటిది పరుచుకుని, దానిమీద వాళ్ళిద్దరు తల్లీ, పిల్ల పడుకుని ఉన్నారు. పిల్లకి పాలిస్తున్నది, అడుగుల శబ్దం విని, చూసిందిటు. 'మనిషి కనిపిస్తే చాలు! మాదాకబళం అడగడం తప్పద' న్నట్టూ, లేచి "బాబూ" అంటూ చెయ్యి చాచింది! శర్మ డబ్బులేస్తోంటే, తీసుకుంటున్నప్పుడు దాని పవిట జారింది. నల్లటి పెద్ద రొమ్ము బయటపడింది. కుతూహలంగా చూస్తున్న స్నేహితుడి వీపుమీద తట్టేడు శర్మ. ఇద్దరూ అక్కడనించీ నడిచేరు.

రాత్రి తను ఊర్నించీ వస్తోన్నప్పుడు ఆ చీకటిలో ఈ చెట్టుకింద భాగోతాన్ని గమనించలేదనుకున్నాడు శర్మ. చిరుగుల బొంత మీద మెమ్మదిగా కదలాడుతోన్న చిన్నప్రాణిని చూస్తే అతనికి తమ పెరటి గదిలో చెక్క పెట్టెలోని కాకిపిల్ల గుర్తుకువచ్చింది.

ఆ రోజంతాకూడా కాకులు వెంటబెడుతూనే ఉన్నాయి. ఇంట్లో అందరినీ—పద్మినితో బాటు!!

'కావ్! క్కావ్వ్! క్కావ్వ్! దీన్ని! ఈ పిల్లని కొట్టండి! తన్నండి! పొడవండి! ఎంత పని చేసిందీ? మన పిల్లని ముట్టుకుంటుందావ్? కావ్? దాచీస్తుందావ్? కావ్? కావ్? దీన్నే కాదు! దీన్లాంటి వాళ్ళందర్నీ పొడవండి! ముక్కూ, చెవులూ, చేతులూ, కాళ్ళూ ఉన్న వాళ్ళందర్నీ తన్నండి!! దుర్మార్గులు!

చంపండి! హహ్హహ్హావ్! కావ్! కావ్! క్కావ్!!'

బలమయిన శత్రుసైన్యం దాడిచేస్తే, బలహీనమైన దేశం ఏంచెయ్యగలదు?

అలాగే ఉన్నాది శర్మ ఇంటి పరిస్థితి!

అక్కడికి ఓపికా, బలమూ ఉన్నంతదాకా, వాళ్ళు కర్రలతో, గొడుగుల్తో (కత్తీ, డాళ్ళకి మల్లే) అడ్డుకుంటూ, ఎదిరిస్తూ, అదిలిస్తూ పెరటివేపూ, వీధిలోకి వెళ్ళొస్తున్నారు.

కాకుల్ని తిట్టుకుంటూ, విసుక్కుంటూ శర్మ, ఎలాగో తెమిలీ, వీధిలోకి బయలుదేరేడు. వాటికి జడిసీ ఎంతగని ఇంట్లో కూచుంటాడు? వాటితో పోరాటం సాగిస్తోనే అంతా ఎవరి పనలు వాళ్ళు చేసుకుంటున్నారు.

శర్మ వీదిలోకి వెళ్ళేసరికి, అక్కడ పెద్ద గోలగావుంది!

ఆ బిచ్చగత్తె అలోపొలోమంటూ ఏడుస్తోంది! కేకలు వేస్తోంది! తిడ్తోంది...ఎవరినో? ఎవరిని చెప్మా?...

శర్మ ఆత్రంగా అటు నడిచేడు.

బిచ్చగత్తెదగ్గర ఒక పదేళ్ళ కుర్రవాడు వున్నాడు. మాసీ, వేళ్ళాడుతోన్న నిక్కరొక్కటే వాడి వంటిమీద వున్నది. బాగా పెరిగి దుమ్ముకొట్టుకునుంది వాడి తల. ఎముకలు ఎక్కడెక్కడ అక్కర్లేకుండా ఎక్కువపోజవుతూంటే, వాడి నల్లటి జీర్ణశరీరం ఆయాసంతో, ఒగర్పుతో తీవ్రంగా చలిస్తోంది!

వాడిమీదకి వెళ్ళింది బిచ్చగత్తె! వాడి జుత్తు పట్టుకుంది! ఎడాపెడా కొట్టింది!!

అప్పుడు దానికళ్ళు కాళికాదేవి కళ్ళలా వున్నాయి భయంకరంగా! దాని చూపులూ సెగలూ క్రక్కుతున్నాయి! దానిజుత్తు పరిం‌ఛి చెలరేగి పరుచుకుంది వీపునీ, ముఖాన్నీ! చీరె చెరగు వూడిపోయిందా ఆవేశంలో! దాని ఎత్తయిన నల్లటి రొమ్ములు బరువు బరువుగా కదలాడుతూ, అక్కడికి చేరినవాళ్ళ కళ్ళని గుచ్చుతున్నాయి. అదేడుస్తోంది! అరుస్తోంది!

"ఏట్రా? దొంగనాయాలా! ఏటిసేస్తావురా నా బిడ్డనీ? కళ్ళుపొడిసీస్తావ్రా? నా బిడ్డని గుడ్డిదాన్ని చేసేసీ, డబ్బుల్చేసుకుంటావట్రా? లేకపోతే శవాన్ని సేసీసీ, అడుక్కుందారనా? అందుకనెత్తుకుపోతన్నావ్రా? దొంగనాయాలా?..."

చూసేవాళ్ళవేపు తిరిగిందది!

"బాబుల్లారా! నేను అలాగ కాస్తటుఎల్లేనో నేదో, ఈ దురమార్గపు సచ్చినోడేమో సూడండి! నా బిడ్డనెత్తుకుపోతావున్నాడు! ఇంకొన్నయ్యిం! నాను సూసేను! ఎంటనే ఒక్కనూపునెల్లీ, మీదపడీ, నా బిడ్డని లాగీసుకున్నానండీ! నేకపోతే ఎంత పనయిపోను! నా బిడ్డ నీఎధవేటి సేసేసునో?..."

బూతులు తిడ్తూ వాణ్ణి మరోనాలుగు తన్నిందది!

కొందరు ఆకుర్రాణ్ణి అసహ్యించుకున్నారు. కొందరు వాడిని తిట్టేరు. కొందరు వినోదంగా మాత్రం దాని ఆకారాన్నీ, వికారాన్నీ టిక్కెట్టులేని ప్రేక్షకులయి తిలకిస్తున్నారు!

ఎలాగో దాని బారి నుంచీ వాడు విడివడి కాస్త ఎండగా వెళ్లేడు! శర్మ అటు వెళ్ళేడు ఎందుకో అతని కాకుర్రాడి మీద కోపం రావడం లేదు.

వాడు దొంగలాగా, దుర్మార్గుడిలాగా అనిపించటం లేదతనికి. వాడి ముఖంలో కేవలం దైన్యం, నిస్సహాయతే ద్యోతకమవుతోందతనికి. పిలిచేడు వాడిని.

శర్మని చూసి, అతను తనని పిలవడం విని, వాడు నింపాదిగా వచ్చేడు.

"ఏరా? ఆ పిల్లన్నువ్వు ఏం చేసేవ్? ఎత్తుకుపోదామని చూసేవా? నిజం చెప్పు?" అడిగేడు శర్మ.

వాడు బుర్ర అడ్డంగా ఆడించేడు.

"నాను దొంగని కానండీ" అన్నాడు! వాడు ఆ తరవాత చెప్పినది విని శర్మ మరీ ఆశ్చర్యపోలేదు.

ఆ పసిపిల్లని ఒంటరిగ వదిలీ బిచ్చగత్తె ఏ అవశిష్టం తీర్చుకుండకో, ఆ పక్కకి వెళ్ళిన సమయంలో, ఆ కుర్రాడు అటుగా వచ్చేడు. ఓ కుక్క ఆ పిల్లని వాసన చూస్తుండడం చూసి, అదేం చేస్తుందోనని, వాడు పసిదాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు. కుక్క వదిలించీ, అంతలో బిచ్చగత్తె ఆ దృశ్యం చూసి, వాడు తన పిల్లనేదో చేసేస్తున్నాడని, ఎత్తుకుపోతున్నాడని అనుకుని వాడి మీద వెళ్ళి పడింది. వాడు చెప్పిందది విని పించుకోలేదు! దాని గోలే దానిది!

శర్మ వాడిని అక్కడినించీ పంపించేసేడు.

ఇంటికి వెళ్ళేక చెల్లాయి అడిగితే ఆగొడవ చెప్పేడు.

పెరట్లో కాకులు అరుస్తూనే ఉన్నాయి.

వీధిలో బిచ్చగత్తె వాణ్ణి తిడుతోనే ఉంది. వాటిదీ, దానిదీ కడుపు పోషే! అయినా చిన్న తేడా!! దాని బిడ్డని దానికిచ్చేస్తే తీసుకుంది. అవి మాత్రం వాటి పిల్లని పరిగ్రహించవు!! ముట్టుకున్నారని మాత్రం తెగగోలపెడ్తున్నయ్!! ఆ రెండు సంఘటనలకీ ఉన్న సామ్యాన్ని గూర్చి ఆలోచిస్తూ నవ్వుకున్నాడు శర్మ. చెల్లెలుమాత్రం కాకిపిల్ల ఉన్నంతదాకా, దాని పోషణాభారం వహిస్తానన్నది. *

## పరిష్కారం

శర్త: ఎలాగైనా పక్కింటి సుధతో మీ తమ్ముడి స్నేహం కట్ చెయ్యమన్నావ్‌గా... చేసేశా!

భార్య: ఎలా?

శర్త: వెరీ సింపుల్... నేనామెను ప్రేమించా!

—కె. వీణా రెడ్డి
బాగలింగంపల్లి

